క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

మద్దూరు: మండలంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం విద్యుత్ మరమ్మతు పనులు కొనసాగుతుండటంతో మద్దూరు పట్టణం, రెనివట్ల, పెదిరిపాడ్, నాగంపల్లి, ఖాజీపూర్ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ నిరంజన్‌దాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 3నుంచి 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఎంపీ బండి సంజయ్‌కి సన్మానం



నారాయణపేట రూరల్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను శనివారం హైదరాబాద్‌లో పేట బీజేపీ నాయకులు కలుసుకున్నారు. ఎంపీగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారి కేంద్రమంత్రిగా అవకాశం దక్కడంపై ఆయనకు శాలువా, బొకెతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రతంగపాండురెడ్డి, శ్రీనివాస్, రఘురామయ్యగౌడ్, నందునామాజీ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మద్దూరు: దళితులు క్రైస్తవులుగా మారిన వారికి ఎస్సీ రిజర్వేషన్లు తొలగించాలని, అలాగే ఏలాంటి అనుమతి లేకుండా గ్రామాల్లో నిర్మించిన చర్చిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీబీ వెంకటేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని తహసీల్దార్ మహేష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ వారు మాట్లాడుతూ కొద్దిమంది దళితులు క్రైస్తవులుగా మారినప్పటికీ అక్రమంగా ఎస్సీ రిజర్వేషన్లు పొందుతున్నారని, వారిని గుర్తించి బీసీ-సీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా జీవరత్నం

ఊట్కూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల ప్రత్యేకాధికారిగా జీవరత్నం శనివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయగౌడ్, సూపరింటెండెంట్ కొండన్న, ఏపీఓ సత్యప్రకాష్, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్యే పర్యటన

నారాయణపేట రూరల్: పేట నియోజకవర్గంలో సోమవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు మరికల్‌లో కేజీబీవీ భవన ప్రారంభం, 10గంటలకు రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, 11:30 గంటలకు ధన్వాడలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం తరువాత పట్టణంలోని ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను ఆర్డీఓ కార్యాలయంలో అందిస్తారు.

అదనపు కలెక్టర్‌గా నియామకంపై హర్షం

ధన్వాడ: జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ధన్వాడకు చెందిన మాకం రఘువరన్ నియామకంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ధన్వాడకు మాకం సత్యనారాయణ అన్నపూర్ణల మొదటి కొడుకు రఘువరన్ ధన్వాడ శ్రీ చైతన్య విద్యామందిర్ పాఠశాలలో ఆరోతరగతి వరకు చదువుకుని నవోదయ ఒట్టెం పాఠశాల సీట్ సాధించి అక్కడి నుంచి ఉన్నత చదువులకు హైదరాబాద్ వెళ్లారు. 2015 గ్రూప్-1 ఎంపికలో 12వ ర్యాంకు సాధించి డీపీఓగా బాధ్యతలు చేపట్టి అదనపు కలెక్టర్‌గా నియమితులవడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల జిల్లా కమిటీ సభ్యుల ఎన్నిక

నారాయణపేట: 317జీఓ ద్వారా స్థానికత కోల్పోయి రెండున్నర ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు శనివారం జెడ్పీహెచ్ఎస్ మరికల్ బాలుర పాఠశాలలో సమావేశమై జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రమేష్, ఉపాధ్యక్షుడిగా విశాల, రవికిరణ్, గౌరవ అధ్యక్షుడిగా వీరేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా డెవిన్, కో-శాధికారిగా వెంకటేష్‌తోపాటు పదిమంది కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు.. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. నిర్ణిత గడువును విధించి, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సింగారంలో పారిశుద్ధ్య పనులు

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామంలో ప్రత్యేక అధికారి శోభారాణి ఆదేశాల మేరకు శనివారం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీధుల్లో చెత్తచెదారం, మురుగు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అదేవిధంగా అంటువ్యాధుల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వానాకాలం.. జరభద్రం

- విద్యుత్ వైర్లను సరి చేసుకోవాలి
- సమస్యలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలి
- సొంతంగా పనులు వద్దు
- జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ



విద్యుత్ మరమ్మతులు పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఏఈ (ఫైల్)

మాగనూర్: వర్షాకాలంలో విద్యుత్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం. తెలుగు రాష్ట్రాలలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వర్షంతోపాటు గాలి వీచే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా రైతన్నలు వర్షాలు రాగానే వానాకాలం పంటల సాగు కోసం చేనులో విద్యుత్ స్తంభాలు ఉన్న చోట యంత్రాలతో దుక్కిదున్నే క్రమంలో పొరపాటున విద్యుత్ సంత్భాలను తాకినట్లయితే ప్రమాదాలు జరగవచ్చు. పంట చేలలోని విద్యుత్ మోటార్లకు అందించే విద్యుత్ తీగలు కింద వేలాడి నట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించి విద్యుత్ తీగలను సరి చేసిన తరువాతనే పంటల సాగుచేయాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు.

విద్యుత్ మోటార్లు బిగించే క్రమంలో ..

పంటలు సాగుచేసే ప్రతి రైతు వేసవిలో మోటార్లను తీసేసి వర్షాలు పడే సమయంలో మళ్లీ విద్యుత్ మోటార్లను అమర్చే క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులే మరమ్మతులు చేస్తూ ఉంటారు. దీంతో విద్యుత్ మోటార్లు కాలిపోయే ప్రమాదం ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. రైతులు సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దని విద్యుత్ అధికారులను సంప్రదిస్తే మోటార్లకు సరి చేసిన తరువాతనే పంటలు సాగుచేయాలని కోరుతున్నారు.

పంటల రక్షణకు విద్యుత్‌ను వాడొద్దు..

పంటలు చేతికొచ్చే సమయంలో కొంతమంది రైతులు పంట చుట్టూ ఇనుప వైర్‌ను ఏర్పాటు చేసి దానిని విద్యుత్‌ను అనుసంధానం చేస్తారు. దీంతో జంతువుల బారి నుంచి పంటలు కాపాడుకోవచ్చు. కానీ అది చాలా ప్రమాదం, ఇదే సమయంలో రైతులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. ప్రతి రైతు పంట చేలో విద్యుత్ జాగ్రత్తలు పాటిస్తూ పంటలు పండించాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

- వర్షాలు పడేటప్పుడు స్టే వైర్, విద్యుత్ లైన్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అస్సలు నిలబడొద్దు..
- వీలైనంత వరకు విద్యుత్ వైర్లకు, స్టే వైర్లకు ట్రాన్స్‌ఫార్మర్‌కు, ఇతర విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలి.
- రోడ్డు మీద్దగానీ, నీటిలో కాని విద్యుత్ తీగ పడి ఉన్నట్లు గుర్తిస్తే విద్యుత్ తీగను తొక్కకూడదు. వాటి మీద నుంచి వాహనాలు నడపకూడదు.
- చెట్ల కొమ్మలపై, వాహనాలపై భవనాలపై తెగి పడ్డ తీగలు ఉన్నట్లయితే వాటిపై అప్రమత్తంగా ఉండాలి.
- విద్యుత్ తీగ తెగిపడినట్లుగా గుర్తిస్తే వెంటనే మీ సమీప విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలి.

అవగాహన కల్పించాలి..



పంట పొలాల్లో విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి. వర్షాకాలంలో విద్యుత్ వలన అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులు వినియోగించే మోటార్ల సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించి రైతులను అప్రమత్తం చేయాలి. లేకుంటే రైతులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

- వెంకటయ్య, రైతు మాగనూర్

సంబంధిత అధికారులను సంప్రదించాలి..



రైతులు వర్షాకాలం నేపథ్యంలో సొంతంగా మరమ్మతులు చేపట్టకుండా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలి. లేనిచో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రైతులు చిన్నపాటి పొరపాటు కూడా చేయొద్దు.

- దేవెంద్రనాయుడు, విద్యుత్‌శాఖ ఏఈ, మాగనూర్

పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న కాంప్లెక్స్ జీహెచ్ఎం మురళీధర్‌రెడ్డి

మాగనూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కాంప్లెక్స్ జీహెచ్ఎం మురళీధర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని పర్మన్‌దొడ్డి, ఓబ్లాపూర్, అమ్మపల్లి, పుంజనూర్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పర్మన్‌దొడ్డి పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు చాలా బాగుందని, విద్యార్థులు చాలా చక్కగా చదువుతున్నారని తెలిపారు. ముఖ్యంగా 4వ తరగతి విద్యార్థులు ఆంగ్ల బాషాలో చదవడం, రాయడం చాలా బాగుందన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం వారానికి 3 రోజులు గుడ్లు పెట్టాలని, విద్యార్థుల హాజరును ప్రతిరోజు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ కృష్ణయ్య, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



నారాయణపేట: 60ఏళ్ల పైబడిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్‌కు లక్ష రూపాయలు, జీతంలో సగం పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలను సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం ప్రారంభించి మాట్లాడారు.. బీఆర్ఎస్ ప్రభుత్వం 60సంవత్సరాలు పైబడిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రెండు లక్షలు, లక్షగా పెన్షన్ కూడా ఇస్తామని ప్రకటించి, ప్రభుత్వం మారిందన్నారు. అదేవిధంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జోషి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అతితక్కువగా రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తామని చెప్పడం భావ్యం కాదని, ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకుండానే నిర్లక్ష్యంగా వారి స్థానంలో కొత్తవారిని రిక్రూట్‌మెంట్ చేయడం న్యాయం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా జూలై 5న సీఎం రేవంత్ ఇంటి ముట్టడి జరిగిందని, 6న రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయన్నారు. బాలమ్మ, తిప్పమ్మ, నర్సింగమ్మ దీక్షలో కూర్చోగా వారికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ మద్ధతు తెలిపారు. అనంతరం డీటీ నారాయణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

నిఘా వ్యవస్థను పటిష్ట పరుస్తాం



సీసీ ఫుటేజీను పరిశీలిస్తున్న ఎస్ఐ మురళి

మరికల్: చట్టంలో మార్పులు రావడంతో పట్టణంలో ప్రధాన కూడళ్లలో నిఘా వ్యవస్థను పటిష్ట పర్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మురళి అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీసీ ఫుటేజీను పరిశీలించారు. మండలంలోని గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పని చేయకపోవడంతో వాటిని మరమ్మతులు చేయడం కోసం టెక్నిషియన్స్‌ను రప్పించినట్లు తెలిపారు. అలాగే బస్టాండ్‌లో తరచుగా జరుగుతున్న చోరీలను దృష్టిలో ఉంచుకుని అక్కడ నాణ్యమైన రెండు కొత్త కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాత వాటిని కూడా మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకొస్తామన్నారు. పట్టణంలో ఇటీవల కాలంలో చోరీలు జరుగుతుండటంతో సీసీ కెమెరాలు ఏర్పాటు ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ప్రధాన కూడలి వద్ద కెమెరాలు క్లియర్‌గా కన్పించేలా చర్యలు తీసుకోవాలని టెక్నిషియన్స్‌కు సూచించారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న అంజనేయులు

నారాయణపేట రూరల్: నిత్యం ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడంతో వారికి మానసిక ప్రశాంతత లభించి ఆరోగ్యకరంగా తయారవుతారని శ్రీ రామచంద్ర మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ గద్దె అంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీసాయి ఆలయ ఆవరణలో శ్రీసాయి విజయ కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఉచిత ధ్యాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ధ్యానం చేయడంతో కలిగే ఉపయోగాలు, చేసే విధానం వవరించారు. అన్ని వయస్సుల వారు ప్రతిరోజు గంట పాటు ధ్యానం చేయాలన్నారు. ఆరోగ్యంతోపాటు వివేకం, విజ్ఞానం పెంపొందిచబడుతాయన్నారు. అదేవిధంగా ఆదివారం ఉదయం 9నుంచి 10:30గంటలు, తిరిగి సాయంత్రం 6నుంచి 7గంటల వరకు రెండో విడత శిబిరం జరుగుతుందన్నారు. పట్టణ, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గందె ఉమాకాంత్, మందార్, శివరాజ్, మాధవరెడ్డి, చెన్నారెడ్డి, సీతారాములు, సతీష్, కృష్ణారెడ్డి, అన్నపూర్ణ, సంధ్య, శిరీష పాల్గొన్నారు.

యాంటీడ్రగ్స్‌పై వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ రమేష్

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం జిల్లా కేంద్రంలో ఇంటర్‌నేషనల్ యాంటి డ్రగ్స్, అక్రమ రవాణాపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతి ప్రభ, రెండో బహుమతి నందిని, మూడో బహుమతి సాయిప్రశాంత్ గెలుపొందారు. ఈ మేరకు.. ఎస్ఐ రమేష్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింహాచారి, ఉపాధ్యాయులు ఉమ, శుభాషిణి, నర్మద, సురేష్, అముల్య, రేఖ, వెంకటమ్మ పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయం



మక్తల్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ధన్వాడలో..

మక్తల్: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయమని వివిధ సంఘాల నాయకులు అన్నారు. శనివారం బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా పట్టణంలోని విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు.. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాగౌడ్, జుట్లశంకర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చిన్నహన్మంతు, కుర్మయ్య, అశోక్‌కుమార్, శ్రీనివాసులు, బాబు, సాగర్, అచ్చన్న తదితరులు పాల్గొన్నారు.


కోస్గి: బాబుజగ్జీవన్‌రాం వర్ధంతిని పురస్కరించుకొని శనివారం గుండుమాల్‌లో పలు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు గొరగాళ్ల కృష్ణ, శ్రీనివాస్, మాసప్ప, దస్తప్ప, దాసు, విష్ణు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో శనివారం బాబు జగ్జీవన్‌రాం వర్ధంతిని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సంతబజార్‌లో ఉన్న జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శంకర్, నర్సింహులు, కిష్టయ్య, రాములు, బాలయ్య, బాల్‌నర్సింహులు, రాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్వ: అణగారిన వర్గాల సంక్షేమంకోసం కృషిచేసిన గొప్పసంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు డా. బాబు జగ్జీవన్‌రాం అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా శనివారం లంకాల్‌లో ముఖ్య కూడలి వద్ద విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊట్కూరు: బాబుజగ్జీవన్‌రాం వర్ధంతిని పురస్కరించుకుని శనివారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ మమత, ఆర్ఐ వెంకటేష్, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరుగు పందెంలో బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న లింగప్ప

మాగనూర్: మండల పరిధిలోని కొల్పూర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు లింగప్ప పరుగు పందెంలో బంగారు పతకం సాధించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న రాష్ట్రస్థాయి పరుగు పందెం సికింద్రాబాద్‌లోని ఫరేడ్ గ్రౌండ్‌లో జరిగిన పోటీలో మొదటి స్థానం సాధించి బంగారు పతకం సొంత చేసుకున్నట్లు తెలిపారు. అంగవైకల్యం జయించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై లింగప్పను గ్రామస్తులు అభినందించారు.

ప్రజా భవన్‌ను ఇనుప కంచెల భవన్‌గా మార్చారు

దామరగిద్ద: ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా భవన్‌ను ఇనుప కంచెల భవన్‌గా మార్చారని బీజేపీ ఓబీసీ యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సింగారం ఆంజనేయులు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరించిన కారణంగానే తగిన గుణపాఠం చెప్పారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోను ప్రజా భవన్‌కు బారికేడ్లు ఇనుప కంచెలు, పోలీసుల లాఠీ దెబ్బలకు నిరుద్యోగులను బలిచేస్తుందన్నారు. కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పరిపాలనతో మాత్రం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ, జాబ్ క్యాలెండర్ అమలు, జీఓ 46రద్దు వంటి హామీలను అమలు చేయాలన్నారు.

న్యాయ చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పీపీ సురేష్

మద్దూరు: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో న్యాయ చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ మాట్లాడుతూ.. బాధితులు ఉచిత న్యాయం ఎలా పొందాలో, చట్టాలను అతిక్రమించి ప్రవర్తిస్తే ఏ విధమైన శిక్షలు ఉంటాయో వివరించారు. ప్రజలు వీటిపై అవగాహన కలిగి ఉంటే నేరాల రేటు తగ్గుందనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే కొత్త న్యాయ చట్టాలు గురించి వివరించారు. కార్యక్రమంలో బాల్య వివాహాలపై, ఆర్థిక అక్షరాస్యతపై ఆయా సంస్థల ప్రతినిధులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్, స్పెషల్ పీపీ విజయ్‌శ్రీధర్, తహసీల్దార్ మహేష్‌గౌడ్, ఎంపీడీఓ జయరాములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, ఎంపీఓ రామన్న పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడితే చర్యలు



బొమ్మన్‌పాడు స్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్ : మహిళలు తప్పకుండా షీటీంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని షీటీం బృంద సభ్యుడు బాలరాజు అన్నారు. శనివారం మండలంలోని బొమ్మన్‌పాడు జెడ్పీపాఠశాలలో అవగాహన నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీటీం ఉంటాయనే విషయంపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. అదేవిధంగా మత్తుపదార్థాలు తీసుకోవడంతో కలిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా సైబర్‌నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలను నడపొద్దని, విపత్తు నివారణ చట్టం అమలులో ఉన్నందున నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. నిత్యం యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, గృహహింసా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం బృంద సభ్యురాలు నమీనా, బరోసా బృందం సభ్యులు దేవి, రాధిక, పాఠశాల జీహెచ్ఎం బాలాజీ, పీఎస్ హెచ్ఎం భాగ్యరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలు సంరక్షించాలి



మరికల్‌లో మొక్కలు నాటుతున్న ఉపాధి కూలీలు

నారాయణపేట రూరల్: ఆకతాయిల చర్యతో దాదాపు 200మొక్కలు అగ్నికి ఆహుతైన చోట తిరిగి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. శనివారం వనమహోత్సవంలో భాగంగా సింగారం ఫీల్డ్ అసిస్టెంట్ కాంతరాజ్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు రోడ్డుకు ఇరువైపుల టేకోమా, గుల్మోరా వంటి మొక్కలను నాటారు.

మరికల్: వర్షాలు కురవడంతో రహదారుల ఇరువైపుల మొక్కలను నాటించే పనిలో ఉపాధి అధికారులు నిమగ్నమయ్యారు. శనివారం కన్మనూర్ పరిధిలోని రోడ్లకు ఇరువైపుల ఉపాధి కూలీలచే మొక్కలను నాటించారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు కూడా చర్యలు తీసుకుంటామని టెక్నికల్ అసిస్టెంట్ గౌస్ తెలిపారు. అలాగే ప్రధాని మోదీ పిలుపు మేరకు అమ్మ పేరుతో మొక్కలు నాటాలని పిలుపునివ్వడంతో శనివారం మండలంలోని బీజేపీ నాయకులు గ్రామంలో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మతిన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి వేణు, రమేష్, రాజేష్, వెంకటేష్, నర్సింహ, నరేష్, కిషోర్ పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు



కుక్క టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

మద్దూరు: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని పశువైద్యశాలలో రేబిస్ విస్తరణ నివారణలో భాగంగా శనివారం కుక్కలకు, పిల్లులకు ముందస్తు టీకాలను డాక్టర్ విశాల, వీఏ రాజశేఖర్ వేశారు. ఈ మేరకు.. పెంపుడు జంతువులతో మనుషులకు ఏ విధంగా రేబిష్ వ్యాధి సోకుతుందని వివరించారు. జూనోసిస్ డేను పురస్కరించుకొని 23 కుక్కలకు, 8 పిల్లులకు పిచ్చిరోగం రాకుండా ముందస్తు టీకాలు వేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది యుద్ధం, అనిత పాల్గొన్నారు.

అటెండరే దిక్కు ..



డాక్టర్లు లేకపోవంతో ఖాళీ కుర్చీలు

మక్తల్: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం పట్టణంలోని పశుసంవర్ధక శాఖ ఆస్పత్రిలో ఏమాత్రం క్యాంపు ఏర్పాటు చేయకుండా డాక్టర్లు ఎవరు లేరు. కేవలం అటెండరే దిక్కు.. కుక్కలు, పిల్లులకు వ్యాక్సినేషన్ ముందస్తు జాగ్రత్తగా రేబిస్ నివారణకు చర్యలు తీసుకునేందుకు క్యాంప్ ఏర్పాటుచేయాలనిఉన్నతాధికారులనుంచి ఆదేశాలు ఉన్న పశు సంవర్ధకశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.